నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



బండ్లగూడ: హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ పి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు వేంకటేశ్వర కాలనీ, డైమండ్‌హిల్స్, ప్రశాంత్‌నగర్, బృందావన్‌కాలనీ, తిరుమల గార్డెన్, పద్మశ్రీహిల్స్, పావని హార్మనీ విల్లాస్, బండ్లగూడ జాగీర్ గ్రామం తదితర ప్రాంతాలు, కాళీమందిర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు విద్యానగర్, వీకర్‌సెక్షన్ కాలనీ, సుబ్రహ్మణ్యకాలనీ, శివపురి, శివసాయినగర్, బైరాగిగూడ, సంజయ్‌గాంధీనగర్, ఇండస్ వ్యాలీ, లిపిడమ్‌విల్లాస్, సంఘంసిటీ, భాగ్యనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో 3.30 నుంచి 5 గంటల వరకు పావనీ పాటిల్స్, కెకె కన్వెన్షన్, రాధానగర్, రాధానగర్ ఫేస్–2, రఘురామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. బుద్వేల్ ఫీడర్ పరిధిలోని బుద్వేల్ విలేజ్, గ్రీన్ సిటీ, శివసాయికాలనీ, గ్రీన్ మెడోస్, పీస్‌హోమ్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు, సహారా హోమ్స్ ఫీడర్ పరిధిలోని జలాల్‌బాబానగర్, ఖయ్యుంనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.30 గంటల వరకు, ఉప్పర్‌పల్లి ఫీడర్ పరిధిలోని సత్‌సంగ్ విహార్, హ్యాపీహోమ్స్, జనచైతన్య, గడా బైగ్, ఫేజ్–3 ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మైలార్‌దేవ్‌పల్లి: రాఘవేంద్ర కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కాటేదాన్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, అలీ మజీద్,శాస్త్రిపురం, జాన్ కిరాణ, కీర్తి వాటర్, ఎమ్మెస్ స్కూల్, నేషనల్ పోలీస్ అకాడమీ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వివిధ విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.

దళితుల భూమి కబ్జాపై ఫిర్యాదు



మట్టితో చదును చేసిన దృశ్యం

శంషాబాద్: 50 ఏళ్ల నుంచి రెవెన్యూ రికార్డుల పరంగా తమ ఆధీనంలో ఉన్న భూములను పక్కనే వెంచర్ నిర్వాహకులు కబ్జా చేస్తున్నారని బ్యాగరి కుటుంబాలకు చెందిన వ్యక్తులు తహసీల్దార్ నాగమణికి ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన ఎస్.ఎస్ రవి కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులతో పాటు పోలీసుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. పట్టణంలోని సర్వేనంబరు 23లో 2.15 ఎకరాల భూమి దళితులైన బ్యాగరి వృత్తిదారులకు సంబంధించిన భూమి ఉందన్నారు. తమ కుటుంబాలకు సంబంధించిన స్వర్గస్తులైన వారి సమాధులు కూడా అక్కడే ఉన్నాయన్నారు. గత రెండ్రోజులుగా అర్ధరాత్రి సమయంలో పెద్దఎత్తున రాళ్లు వేసి మట్టితో చదును చేశారన్నారు. సమీపంలోనే ఉన్న కొందరు వ్యక్తులే కబ్జాకు కారణమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అధికారులు సర్వేనంబరు 23 సర్వేను త్వరగా పూర్తిచేసి బ్యాగరి వృత్తిదారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కబ్జాకు యత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని వినతి..

బండ్లగూడ: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు భోగాల శ్రీనివాస్, దుడ్డు ఆకాష్‌లు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ గ్రామం కొత్త చెరువులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. సర్వే నెంబర్ 66లోని 4.16 ప్రభుత్వ భూమి, గ్రామకంఠం భూమి ఉందన్నారు. 760 గజాల ప్రభుత్వ భూమిలో ఓ నిర్మాణ సంస్థ నిర్మాణాలు చేపడుతుందని, ఆ నిర్మాణాలను నిలిపేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రుల వద్ద నిత్యాన్నదానం



ఆసుపత్రి వైద్యులతో మహ్మద్ బషీర్

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగులకు నిత్యాన్నదానం కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు ప్రభుత్వ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ దవాఖాన వద్ద వైద్యులతో కలిసి రోగుల సహాయకులకు బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 798 రోజులుగా నిత్యం 70–100 మందికి భోజన ప్యాకెట్లతో పాటు వాటర్ బాటిల్స్ కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రుల సిబ్బంది, డాక్టర్లు కూడా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. తమను చూసి యువజన సంఘాల వారు కూడా తమవంతుగా ఆసుపత్రులు, లేబర్ అడ్డాల వద్ద అన్నదానంతో పాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

పంటమార్పిడి విధానాన్ని అవలంభించాలి

నాబార్డ్ తెలంగాణ డిప్యూటీ జనరల్ మేనేజర్ దీప్తి సుదీవ్



నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రైతులు పంటల అధిక దిగుబడుల కోసం సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకు పంటమార్పిడి విధానాన్ని తప్పనిసరిగా అవలంభించాలని నాబార్డ్ తెలంగాణ డిప్యూటి జనరల్ మేనేజర్ దీప్తి సుదీవ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో జరిగిన వినియోగదారుల సదస్సు రెండోరోజు సమావేశం జరిగింది. ఈ ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్ని మాట్లాడారు.

వాతావరణ మార్పులకనుగుణంగా..

రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా భూసార పరీక్షలు చేసి వ్యవసాయం చేయాలని తప్పనిసరిగా లాభాలు ఉంటాయని సూచించారు.

- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను వేయలని, కోవిడ్‌లో అనేక రంగాలు మూతపడినా.. వ్యవసాయరంగం సఫలమైందని పేర్కొన్నారు.
- వ్యవసాయ ఉత్పత్తి సంఘాల రైతులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేసి అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, విస్తరణ విద్యాసంస్థ అధికారులు, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మనూ ప్రధాన క్యాంపస్‌లోని పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించినట్లు 'మనూ' పాలిటెక్నిక్ హైదరాబాద్ ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్ బుధవారం తెలిపారు. ఉర్దూ మీడియం నుంచి లేదా ఉర్దూను ఒక సబ్జెక్టుగా చదివిన విద్యార్థుల కోసం నాలుగు డిప్లొమో కోర్సులలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్‌లో డిప్లొమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి నాలుగు కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్లతో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను సమర్పించాలని, ప్రాస్పెక్టస్, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ నందు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9848171044లో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ గోకుల్ ప్లాట్స్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో శ్రమించిన పార్టీ నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాంబయ్య, సంజీవరెడ్డి, శివాజీ, ప్రకాష్‌రెడ్డి, దుర్గారావు, పూర్ణ, హరిబాబు, సుబ్బారావు, రాంమోహన్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దేవా పాల్గొన్నారు.

పర్స సత్యనారాయణకు నివాళి



నివాళులర్పిస్తున్న సీఐటీయూ కార్మిక నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: 19 ఏళ్లలోనే పేదల పక్షాన నిలిచి పోరాటం చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడు పర్స సత్యనారాయణ అని రాష్ట్ర సీఐటీయూ ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. బుధవారం పర్స సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా కాటేదాన్ పారిశ్రామికవాడలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పర్స సత్యనారాయణ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేగా పనిచేసి, సొంత ఇల్లు సంపాదించుకోకుండా ప్రజల కోసం పోరాటం చేసిన మహనీయుడన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కార్మికుల కోసం ఈఎస్ఐ, పీఎఫ్ కోసం అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం. చంద్రమోహన్, కోశాధికారి కవిత, ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, సహాయ కార్యదర్శి దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులు శేఖర్, బుగ్గ రాములు, ఎల్లయ్య, వీరయ్య, ప్రవీణ్, పెంటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై పట్టింపేది..!

- టోలిచౌకీ, గోల్కొండ డివిజన్లలో రోడ్లపైనే చెత్తాచెదారం
- దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు



గోల్కొండ: శానిటేషన్ అధికారులకు పారిశుధ్య పనులపై చిత్తశుద్ధి లేకుండాపోతోంది. పేరుకుపోతున్న చెత్తాచెదారం వల్ల మనుషులకే కాకుండా మూగజీవాలు సైతం రోగాల బారినపడుతున్నాయి. టోలిచౌకీ, గోల్కొండ తదితర డివిజన్‌లో ప్రధాన కూడళ్లు, రహదారుల పక్కన రోజుల తరబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా వార సంతలు జరిగే సెవన్ టూమ్స్ రోడ్డు, గోల్కొండ, రేతిగల్లి, ఫతేదర్వాజా తదితర ప్రాంతాల్లో రోజుల తరబడి వారపు సంత వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తుండడంతో పాటు ఈగలు, దోమలు లాంటి కీటకాలు విజృంభించి స్థానికులకు రోగులు వ్యాపింపజేస్తున్నాయి. గోల్కొండ రేతిగల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఓవైసీ ప్లేగ్రౌండ్, స్విమ్మింగ్ పూల్స్ వద్ద చెత్త కుప్పల పక్క నుంచి వెళ్లే వారు దుర్వాసనతో ముక్కు మూసుకుంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

గోల్కొండ ఏరియాసుపత్రికి రోగుల తాకిడి



గోల్కొండ: గోల్కొండ ఏరియాసుపత్రికి రోగుల తాకిడి పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలడంతో కొన్ని రోజులుగా ఆసుపత్రి ఓపీ రిజిస్ట్రేషన్ విభాగం ఉదయం 7.30 నుంచే వద్ద రోగులు బారులు తీరుతున్నారు. రోజుకు 700–800 మంది ఓపీ కోసం వస్తున్నారని, అన్ని విభాగాలకు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా తెలిపారు. రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. పలువురు బస్తీ దవాఖానలకు సైతం వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుంటున్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: పట్టణంలోని నర్సింగ్ మందిర్ ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్లు వై.కుమార్, రేఖ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేయగా.. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కారులో మంటలు !

ఫిర్యాదు అందలేదన్న పోలీసులు



హైదర్షాకోట్‌లో కారులో చెలరేగుతున్న మంటలు

మణికొండ: రోడ్డుపై వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో కారులోని డ్రైవర్‌తో పాటు చుట్టుపక్కల వారు ఆందోళన చెందారు. నార్సింగి పోలీస్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్ మిలట్రీ స్కూల్ ఎదుట బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌లోని కియా సర్వీస్‌సెంటర్‌కు వచ్చిన కారులో కొన్ని స్పేర్లు వేయాల్సి రావటం, అవి అక్కడ అందుబాటులో లేకపోవటంతో డ్రైవర్ రాజు కొండాపూర్‌లోని సర్వీసింగ్ కేంద్రానికి తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదర్షాకోట్ వద్దకు రాగానే కారులో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే కారులోంచి దిగి ప్రాణాలు దక్కించుకున్నాడు. అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని నార్సింగి పోలీసులు తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. 'యాంటీ టుబాకో డే'ను పురస్కరించుకొని 'విన్ లైఫ్ త్రూ ఓవర్ కమింగ్ అడిక్షన్స్' అనే అంశంపై హోమియోపతి ఫిజీషియన్, కార్పొరేట్ ట్రైనర్, బ్రహ్మకుమారీస్ సంస్థ మెడికల్ వింగ్ యాక్టివ్ సభ్యురాలు డాక్టర్ బి.కె. శ్రీలత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

'400 ఎంపీ స్థానాలు బీజేపీవే'

గోల్కొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలుస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కంది మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రధానిగా నరేంద్రమోదీ పదేళ్లలో తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలే వల్లే ప్రస్తుతం మన దేశం ఆర్థికంగానే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ అగ్రదేశాల సరసన చేరిందని పేర్కొన్నారు. తెలంగాణలో సైతం అత్యధిక స్థానాలు తమ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



రేపు పాలిసెట్-2024 ప్రవేశపరీక్ష

- ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి
- శేరిలింగంపల్లి జోన్ పరిధిలో అయిదు పరీక్షా కేంద్రాలు
- 5 సెంటర్లు..పరీక్ష రాయనున్న 1085 మంది విద్యార్థులు

నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రం లోపలికి అనుమతి లేదు



పరీక్షా కేంద్రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

రాయదుర్గం: పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం (మే 24వ తేదీ) నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పాలిసెట్–24 రీజనల్ కో–ఆర్డినేటర్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ రీజనల్ పరిధిలోని గచ్చిబౌలి, రాయదుర్గం, మధురానగర్, నార్సింగి, మణికొండ ప్రాంతాలలో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. విద్యార్థులు ప్రవేశ పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఒకరోజు ముందు గానే తమ వెంబడి వచ్చే వారు పరీక్షా కేంద్రాన్ని గుర్తించేలా చేయడానికి చొరవ తీసుకోవాలని, లేదంటే యాప్‌ను ఉపయోగించి వెంటనే తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పాలిసెట్‌లో అర్హత సాధించిన వారికి జీఐఎల్‌టీలోని కోర్సులలో చేరడానికి అడ్మిషన్లకు అవకాశం కల్పించడం జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష వివరాలు..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం (మే 24వ తేదీ) నిర్వహిస్తారు.

- పరీక్షను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుంది
- శేరిలింగంపల్లి జోన్ పరిధిలో అయిదు ప్రవేశ పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు.
- ఒక్క నిమిషం (ఉదయం 11 గంటల తర్వాత) ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించకూడదని నిర్ణయించారు.
- విద్యార్థులను ఒక గంట ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు
- గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకొనేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

మొత్తం విద్యార్థులు 1,085 మంది

- పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది ఇవే..
- పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి తీసుకెళ్లనీయరు.
- ముఖ్యంగా సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్ వంటి వాటిని అనుమతించరు.
- బబ్లింగ్‌కు హెచ్‌బీ పెన్సిల్‌ను వినియోగించాలి. హాల్ టికెట్, పెన్, హెచ్‌బీ పెన్సిల్, షార్ప్‌నర్, ఎరేజర్‌ను మాత్రమే అనుమతిస్తారు
- విద్యార్థులకు సెంటర్ లొకేషన్, ప్రవేశ పరీక్షకు సంబంధించి ఇతర సమస్యలుంటే వెంటనే సెల్ నంబర్ 9912342053ను సంప్రదించాలి.

ప్రాంతం	పరీక్షా కేంద్రంపేరు	విద్యార్థుల సంఖ్య
రాయదుర్గం	గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్‌టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్	125 మంది
గచ్చిబౌలి	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	240 మంది
మధురానగర్	ప్రభుత్వ జూనియర్ కళాశాల	240 మంది
మణికొండ	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల	240 మంది
నార్సింగి	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	240 మంది

పరీక్షా కేంద్రం లొకేషన్‌ను గుర్తించేందుకు యాప్- ఎస్‌బీటీఈటీ టీఎస్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది.

ఏర్పాట్లు పూర్తి



శేరిలింగంపల్లి పరిధిలోని అయిదు సెంటర్లలో ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వయంగా అయిదు కేంద్రాలను పరిశీలించి అన్ని సౌకర్యాలు ఉండేలా మాట్లాడాం. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఒక్కనిమిషం ఆలస్యమైనా కేంద్రం లోపలికి అనుమతించరాదని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పోలీసుల సహకారం కూడా తీసుకుంటున్నాం. సెంటర్లను కూడా సులభంగా గుర్తించే వాటినే ఎంపిక చేశాం. గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలి.

– షేక్ ఎక్బాల్ హుస్సేన్, రీజనల్ కో–ఆర్డినేటర్, జీఐఎల్‌టీ ప్రిన్సిపల్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230